క్లుప్తంగా

విజయదుర్గమ్మకు వెండి తామరపువ్వుల సమర్పణ


వెండి తామరపువ్వులు అందజేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : విజయదుర్గమ్మకు శుక్రవారం రెడ్డి నాగేశ్వరరావు, సోనీ సుబ్బలక్ష్మి దంపతులు రూ.40,116 విలువ కలిగిన వెండి తామర పువ్వుల దండను సమర్పించారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులను ఆలయ మర్యాదలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణ, కార్యదర్శి మాదా రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

బుట్టాయగూడెం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎం. శ్రీహరి తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

5న బుద్ధపౌర్ణమి నృత్య సంగీత ధ్యానయజ్ఞం

జంగారెడ్డిగూడెం : బుద్ధపౌర్ణమిని పురస్కరించుకుని జంగారెడ్డిగూడెం ది పిరమిడ్ స్పిరిట్యువల్ ట్రస్ట్ నిర్వహణలో మే 5వ తేదీన సాయంత్రం 5 నుంచి 9 గంటల వరకు స్థానిక శేషాద్రి నగర్‌లోని శ్రీగౌరీ సుభద్ర పిరమిడ్ ప్రాంగణంలో 'బుద్ధపౌర్ణమి నృత్య,సంగీత ధ్యానయజ్ఞం' కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు కాకి రామకృష్ణ, తటవర్తి కృష్ణ తెలిపారు. వేసవి యోగ ధ్యాన కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులకు బహుమతి ప్రదానం, ఆహుతులకు అల్పాహారవిందు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి

టి.నరసాపురం : అధికారులు అంకిత భావంతో పనిచేస్తూ మండల అభివృద్ధికి సహకరించాలని ఎంపీడీవో ఎన్‌టీ స్వామి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యక్రమంలో మండల అభివృద్ధిపై అధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణం ఈకేవైసీ పూర్తి స్థాయిలో నమోదు చేయాలన్నారు. 0 నుంచి 5 ఏళ్ల వయస్సు గల వారికి ఆధార్ నమోదు, 6 నుంచి 19 ఏళ్ల వయస్సు గల వారికి, గర్భిణీలు, బాలింతలకు నూరు శాతం ఆధార్ నమోదయ్యేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి మార్కుల జాబితాలను అందజేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలల్లో నాడు–నేడు పనులపై ప్రగతి నివేదికలు తయారు చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సచివాలయం సిబ్బంది మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

వెల్లివిరిసిన మానవత్వం


జంగారెడ్డిగూడెం సీతామహాలక్ష్మి వృద్ధాశ్రమంలో సేదతీరుతున్న వృద్ధురాలు

జంగారెడ్డిగూడెం : నిరాదరణకు గురైన ఓ వృద్ధురాలిని మానవతా దృక్పథంతో శ్రీ సీతామహాలక్ష్మి వృద్ధాశ్రమం నిర్వాహకులు శేఖర్ అక్కున చేర్చుకున్నారు. మండలంలోని గురవాయిగూడెం గ్రామంలో గత మూడు రోజులుగా ఎవరూ పట్టించుకోకపోవడంతో చెట్టు కింద కాలం వెళ్లదీస్తున్న గ్రామానికి చెందిన వృద్ధురాలి పరిస్థితిని మహిళా పోలీస్ అందించిన సమాచారంతో సర్పంచ్ గుబ్బల సత్యవేణి సీతామహాలక్ష్మి వృద్ధాశ్రమ నిర్వాహకులు శేఖర్‌కు తెలియజేశారు. దీంతో ఆయన స్పందించి వృద్ధురాలిని ఆశ్రమానికి తీసుకువెళ్లారు. శేఖర్ మాట్లాడుతూ గత మూడు రోజులుగా అన్నపానీయాలు లేకపోవడంతో వృద్ధురాలు చాలా నీరసంగా ఉందని, ఆమె ఆరోగ్య పరిస్థితి మెరుగుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు అభినందించారు.

ముగిసిన ప్రచార భేరి

చింతలపూడి : సీపీఐ, సీపీఎం ప్రచార భేరి ముగింపు సభ చింతలపూడిలో శుక్రవారం జరిగింది. సీపీఎం మండల కన్వీనర్ ఆర్‌వీ సత్యనారాయణ, సీపీఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య అధ్యక్షతన జరిగిన ఈ సభలో ముఖ్య అతిథిగా సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డీఎన్‌వీడీ ప్రసాద్ పాల్గొని మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ప్రైవేటుపరం చేస్తూ కార్పొరేట్ కంపెనీలకు కొమ్ము కాస్తోందని మండిపడ్డారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేస్తూ, ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వకుండా, విభజన హామీలను అమలు చేయకుండా, పోలవరం నిర్మాణానికి నిధులు కేటాయించకుండా ఆంధ్ర రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలంతా పోరాడాలని పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, సీపీఎం, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌కు అండగా నిలుద్దాం

లింగపాలెం : ముఖ్యమంత్రి వైస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలబడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని లింగపాలెం మండల సచివాలయ ఇన్‌చార్జి అన్నపనేని శాంతారావు అన్నారు. శుక్రవారం బాదరాల గ్రామంలో జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని మాజీ ఏఎంసీ చైర్మన్ మందలపు సాయిబాబు, పార్టీ నాయకుడు బొల్లినేని సుబ్బారావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు, గ్రామ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరించారు. సంక్షేమ పథకాలు ఏమేరకు అందుతున్నాయని ప్రతి ఒక్కరిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గృహ యజమానుల అనుమతితో ఇంటికి సీఎం వైస్ జగన్ స్టిక్కర్‌లను అతికించారు. శాంతారావు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీ, కుల, మతాలకతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సీఎం వైస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. నాలుగేళ్ల జగన్ పాలనలో దళారీలకు తావు లేకుండా సంక్షేమ పథకాల లబ్ధి సొమ్మును నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రావి కొండయ్య, సుద్దపల్లి రాంబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.


బాదరాలలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు


కొయ్యలగూడెంలో సంక్షేమ లబ్ధి బుక్‌లెట్‌ను అందజేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం గ్రామంలో శుక్రవారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి సర్వే చేశారు. ప్రభుత్వ పనితీరును తెలుసుకుని ప్రజాభిప్రాయాలను నమోదు చేసుకున్నారు. అనంతరం జగనన్న స్టిక్కర్లను పంపిణీ చేశారు. కన్నాపురం గ్రామంలో శనివారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ముగింపు సభ నిర్వహిస్తున్నట్లు జగనన్న సచివాలయాల మండల కోఆర్డినేటర్ నూకల రాము పేర్కొన్నారు. మధ్యాహ్నం నాలుగు గంటల నుంచి ఉప్పల కృష్ణ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే సదస్సుకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే తెల్లం బాలరాజు హాజరై దిశా నిర్దేశం చేస్తారన్నారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు హాజరుకావాలని కోరారు.

నూకాలమ్మకు విశేష పూజలు


నూకాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని నూకాలమ్మకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ, రామలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు మనోజ్ శర్మ నిత్య పూజా కైంకర్యాలతో పాటు విశేష పూజలు జరిపారు. అమ్మవారికి కాకాని శ్రీహరి రావు, రాజ్యలక్ష్మి దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. జె.మోషే, వెంకటలక్ష్మి దంపతులు ప్రసాద వితరణకు రూ. 2116 విరాళంగా ఇచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు, శ్రీనూకాంబిక సేవ బృందం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులు ముందుకురావాలి


ఎస్.రాంబాబు, నగర పంచాయతీ కమిషనర్

చింతలపూడి : నగర పంచాయతీ పరిధిలోని జగనన్న ఇళ్ల కాలనీల్లో ఇళ్లు నిర్మించుకునేందుకు లబ్ధిదారులు ముందుకు రావాలని నగర పంచాయతీ కమిషనర్ ఎస్.రాంబాబు ఆదేశించారు. శుక్రవారం తన కార్యాలయంలో మాట్లాడుతూ స్థలాలు కేటాయించిన కాలనీల్లో ఇళ్ల నిర్మాణం ఊపందుకుందని చెప్పారు. ఇంకా ఇళ్ల నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారులు తక్షణం నిర్మాణాలు చేపట్టాలన్నారు. అదే విధంగా పట్టణ పరిధిలోని ఇంటి యజమానులు చెత్తను చెత్తబుట్టలో వేసి పారిశుద్ధ్య కార్మికులు వచ్చినప్పుడు అప్పగించాలన్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న డ్రైయిన్లలో చెత్త వేస్తే అపరాధ రుసుం వసూలు చేస్తామని హెచ్చరించారు. పట్టణంలో అనధికార లేఅవుట్లు వేసి ప్లాట్లు విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని డీటీసీపీ లేఅవుట్లు లేని వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేయవద్దని కొనుగోలుదారులకు సూచించారు. అటువంటి లేఅవుట్లలో నగర పంచాయతీ మౌలిక వసతులు కల్పించబోదని చెప్పారు. అలాగే ఇళ్లు నిర్మించుకునేందుకు ప్లాను కూడా మంజూరు చేయబోమన్నారు. అనధికారే అవుట్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నెల 30వ తేదీలోగా ఇంటి పన్నులు చెల్లించాలని, ముందుగా చెల్లించే పన్నులపై ప్రభుత్వం రాయితీ ఇస్తున్నట్లు చెప్పారు. పట్టణ ప్రజలు ఇంటి పన్నులు సకాలంలో చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

వేధింపులపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : 20లక్షలు లోన్ పెట్టి తీసుకురమ్మని వేధింపులకు గురిచేస్తున్న భర్తపై భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. వివరాలు ప్రకారం బోడా పూర్ణిమ పేరంపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తోంది. ఆమెకు 2007లో కారుమూరి రవికుమార్ అనే వ్యక్తితో వివాహమైంది. కొంతకాలం తరువాత ఇరువురు పరస్పర అంగీకారంతో విడిపోయారు. ఆ తరువాత 2019లో పెనుగొండకు చెందిన కొల్లేపర మారుతీ కుమార్‌ను ఆమె రెండవ వివాహం చేసుకుంది. కొన్ని రోజులు మారుతీ కుమార్ బాగానే ఉన్నప్పటికీ, అనంతర పూర్ణిమను రూ.20 లక్షలు లోన్ పెట్టి తనకు ఇవ్వాలని మానసికంగా, శారీరకంగా హింసిస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

ఫిష్ ఆంధ్ర పథకంలో 3 యూనిట్ల మంజూరు

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం గ్రామానికి ఫిష్ ఆంధ్ర పథకంలో భాగంగా మూడు యూనిట్లు మంజూరైనట్లు మత్స్య శాఖ జిల్లా అధికారి ఏ.చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం కన్నాపురం రోడ్‌లో పంచాయతీ, మత్స్య శాఖ సహాయంతో నిర్మిస్తున్న దుకాణాల సముదాయాన్ని పరిశీలించారు. ఒక్కో యూనిట్‌ని ఒక్కో షాపుగా పరిగణనలోకి తీసుకొని షాపునకు వచ్చి 60 శాతం సబ్సిడీతో రూ.2 లక్షలతో ఔట్ లేట్ దుకాణం ఏర్పాటు చేసుకోవాలన్నారు. లబ్ధిదారుని వాటా సొమ్ముగా రూ.20 వేలు డీసీసీబీ బ్యాంకులో డిపాజిట్ చేయగా మత్స్యశాఖ రూ.లక్ష అందజేస్తుందన్నారు. మిగిలిన సొమ్ము బ్యాంకు లోన్ ఇస్తుందన్నారు. ఫిష్ ఆంధ్ర దుకాణాలకు సంబంధించి పంచాయతీకి నెల లీజుకు సంబంధించిన సొమ్ములు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ మేరకు పంచాయతీకి లీజుదారులు అగ్రిమెంట్ కూడా చేసి ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గంజిమాల రామారావు, ఎఫ్‌డీఓ మంగారావు, మత్స్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.


కొయ్యలగూడెంలో ఫిష్ ఆంధ్ర దుకాణాలను పరిశీలిస్తున్న మత్స్యశాఖ అధికారులు

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత

లింగపాలెం : తోచలకరాయుడుపాలెం గ్రామానికి చెందిన అల్లిమెల్లి కనకమ్మకు ప్రభుత్వం నుంచి మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి రూ.1,30,000 చెక్కును శుక్రవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మోహన్‌రావు ఆధ్వర్యంలో అందజేశారు. కనకమ్మ ఇటీవల మోకాళ్ల ఆపరేషన్ చేయించుకోగా ఎంపీ కోటగిరి శ్రీధర్ చొరవతో ఆమెకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును మంజూరు చేశారు. సర్పంచ్ శోభారాణి, ఎంపీటీసీ మరియమ్మ, వైస్ సర్పంచ్ బేతిన మధు, పార్టీ నాయకులు తక్కిళ్లపాటి రామ్మోహనరావు, రవి, పుల్లారావు, హృదయరాజు, రఘుబాబు, శివయ్య, శ్రీరామూర్తి చేతుల మీదగా లబ్ధిదారులకు చెక్కు అందజేశారు.


ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందజేస్తున్న మోహనరావు, వైఎస్సార్ సీపీ నేతలు

పోలవరం కాలువ గట్టుపై ఆక్రమణల తొలగింపు

ద్వారకాతిరుమల: మండలంలోని పంగిడిగూడెంలో పోలవరం కుడి కాలువ గట్టుపై ఆక్రమణలను రెవెన్యూ, పంచాయతీ అధికారులు శుక్రవారం మధ్యాహ్నం తొలగించారు. నల్లజర్ల మండలం దూబచర్లకు చెందిన ఒక వ్యక్తి పంగిడిగూడెంలోని పోలవరం కుడి కాలువ గట్టుపై దాదాపు 3 ఎకరాల భూమిని ఆక్రమించాడు. గురువారం అర్ధరాత్రి సమయంలో హడావిడిగా ఫెన్సింగ్ ఏర్పాటు చేశాడు. ఆ సమయంలో స్థానికులు కొందరు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఏలూరు జిల్లా కలెక్టర్ వి.ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు జంగారెడ్డిగూడెం ఆర్డీవో జాన్సీరాణి, ద్వారకాతిరుమల తహసీల్దార్ సుందర్‌సింగ్, ఎస్సై టి.సుధీర్ తదితరులు అన్యాక్రాంత భూమిని పరిశీలించి, ఆక్రమణ జరిగినట్టు గుర్తించారు. ఈ సందర్భంగా ఆక్రమితదారుడు భూమి చుట్టూ నిర్మించిన ఫెన్సింగ్‌ను రెవెన్యూ, పంచాయతీ సిబ్బందిచే తొలగింపజేశారు. అనంతరం ఆ భూమిలో ప్రభుత్వ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు.


పంగిడిగూడెంలో పోలవరం కుడి కాలువ గట్టుపై ఆక్రమణలను పరిశీలిస్తున్న ఆర్డీవో జాన్సీరాణి

మే 1న సత్యదేవుని కల్యాణం

కొయ్యలగూడెం: గవరవరం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ రమా సమేత సత్యనారాయణ స్వామి వారి కల్యాణ ఉత్సవాలు రెండు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ పేర్కొంది. మే 1న శ్రీ రమా సమేత సత్యనారాయణ స్వామి కల్యాణం, ప్రత్యేక హోమాలు నిర్వహిస్తామన్నారు. 2వ తేదీన స్వామివారి వ్రతాలు, మధ్యాహ్నం నుంచి అన్న సమారాధన నిర్వహించనున్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాల్సిందిగా పాలక కమిటీ కోరింది. అదేవిధంగా ఈనెల 29వ తేదీ నుండి 30వ తేదీ వరకు కొయ్యలగూడెంలోని కన్నాపురం రోడ్‌లో ఉన్న వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ పేర్కొంది.

శశి విద్యార్థుల ప్రతిభ

కామవరపుకోట : ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో కామవరపుకోట క్యాంపస్ శశి జూనియర్ కాలేజీ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు ఆ సంస్థ వైస్ చైర్మన్ మేక సరేంద్ర కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో వై.పూజిత నాగసింధు 470 మార్కులకు గాను 466 మార్కులు సాధించారని, సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో పి.చంద్రశేఖర్ 1000 మార్కులకు గాను 990 మార్కులు సాధించినట్లు చెప్పారు. అకడమిక్ డైరెక్టర్ మేక క్రాంతి సుధా, ప్రిన్సిపాల్ వాకలపూడి శ్రీధర్, ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ పి.దిలీప్, సిబ్బంది విద్యార్థులను అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న శశి సంస్థల వైస్ చైర్మన్ మేక నరేంద్ర కృష్ణ

సుస్థిర అభివృద్ధి కోసం టాస్క్‌ఫోర్స్ కమిటీలు


జీలుగుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న స్నేహన్

బుట్టాయగూడెం:(జీలుగుమిల్లి) : సుస్థిర అభివృద్ధి, లక్ష్యాల సాధన కోసమే ప్రభుత్వం గ్రామ స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేసిందని సచివాలయాల శాఖ సామాజిక పరివర్తనా మార్పు సమాచార విభాగం జిల్లా కోఆర్డినేటర్ టీఎస్.స్నేహన్ అన్నారు. జీలుగుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం టాస్క్‌ఫోర్స్ కమిటీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో 1-5 సాధన కోసం అవగాహన అవసరం అన్నారు. గర్భిణీలు, బాలింతలు, యుక్త వయసు బాలికలు వారి ఆరోగ్యాలపై దృష్టి సారించాలని చెప్పారు. యుక్త వయసు బాలికలు క్రమం తప్పకుండా రక్త శాతం తెలుసుకునే పరీక్షలు జరపాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బి.గాయత్రి, ఎంపీహెచ్ఎస్. పి.నాగరత్నం, ఎం.చంద్రం, ఎంపీహెచ్‌ఓలు బి.శ్యామల, సీహెచ్ రచన, జి.లక్ష్మీ. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎం.లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.

డ్రాపౌట్స్‌ను గుర్తించాలి

బుట్టాయగూడెం : మండలంలోని ప్రతి పాఠశాల పరిధిలో డ్రాపౌట్స్ విద్యార్థులను తప్పనిసరిగా గుర్తించాలని ఎంపీడీవో ఎం.శ్రీహరి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన ప్రధానోపాధ్యాయులు, కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో పేరెంట్స్ కమిటీ సమావేశాలు ఏర్పాటు చేసి పాఠశాలల్లో అమలవుతున్న పథకాలు, ఏడాది పాటు విద్యా విధానంలో చేపట్టిన పనులపై సమగ్ర నివేదికలు రూపొందించాలన్నారు. ఎంఈఓ టి. బాబూరావు మాట్లాడుతూ డ్రాపౌట్స్ వివరాలు, ఎస్‌డీజీ సర్వే వివరాలు సమగ్రంగా ఉండేలా చూడాలన్నారు. అలాగే పాఠశాలల్లో వాచ్‌మెన్‌ల నియామకంపై దృష్టి పెట్టాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంఓ శిరమయ్య, ఉపాధ్యాయులు శాస్త్రీ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీహరి

మే డేను విజయవంతం చేయండి


ప్రజా సంఘాల కార్యాలయం వద్ద మేడే గోడ పత్రికను ఆవిష్కరించిన దృశ్యం

చింతలపూడి : ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే ను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌వీఎస్ నారాయణ పిలుపునిచ్చారు, స్థానిక ప్రజా సంఘాల కార్యాలయం వద్ద మేడే గోడ పత్రికను శుక్రవారం ఆవిష్కరించారు. కార్మిక హక్కులను కుదించి కార్మిక చట్టాలను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను కార్మికులంతా కలిసి ఎదుర్కోవాలని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసి పారిశ్రామిక వర్గాలకు దేశ సంపదను ధారాదత్తం చేస్తున్నారని విమర్శించారు. వాడవాడలా మేడే పండుగను కార్మికులు, ఉద్యోగ సంఘాలు జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్‌డీ జబ్రుల్లా, నత్తా వెంకటేశ్వర్రావు, ఎం.బాలరాజు, ఎస్.సరోజిని, టి.మాణిక్యం పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్‌ను సద్వినియోగపరచుకోవాలి

కామవరపుకోట : డిగ్రీ మూడో సంవత్సరం విద్యార్థులు 6వ సెమిస్టర్‌లో ఇంటర్న్‌షిప్‌ను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవీంద్రబాబు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన విద్యా విధానంలో విద్యార్థులలో నైపుణ్యాన్ని పెంపొందించడం కోసం, భవిష్యత్‌లో ఉద్యోగం, స్వయం ఉపాధి అవకాశాలను కల్పించడం కోసం ఇంటర్న్ షిప్‌ను వినియోగించుకోవాలన్నారు. 6 నెలల ఇంటర్న్ షిప్ శిక్షణ నిమిత్తం కొయ్యలగూడెం లక్ష్మీదీప ఎడ్యుకేషనల్ మెమోరియల్ సొసైటీకి 20 మంది విద్యార్థులను, కేఆర్ పురం యువజన శిక్షణ కేంద్రానికి 30 మంది విద్యార్థులు, విజయవాడలో లోహిత్ శిక్షణ కేంద్రానికి 15 మంది విద్యార్థులను, కామవరపుకోట పంచాయతీ కార్యాలయానికి ఐదుగురు విద్యార్థులను ఇంటర్న్‌షిప్‌నకు అనుసంధానించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎం.మల్లేశ్వర రావు, డాక్టర్ జి.శ్రీనివాసరావు, గుండా రామ్మోహన్, ధారావతు మల్లేష్, వి.శ్రీనివాస్, ఎ.హర్షవర్ధిని, నజ్మా, విద్యార్థులు పాల్గొన్నారు.


విజయవాడ శిక్షణ కేంద్రంలో డిగ్రీ విద్యార్థులు

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణకర్త బవిరిశెట్టి మురళీకృష్ణ, పద్మకుమారి దంపతుల పర్యవేక్షణలో అర్చకులు ముత్యాలమ్మకు, అనంత ఈశ్వరస్వామికి పంచామృత, ఏకవార రుద్రాభిషేకాలు, కుంకుమ పూజ, విశేష హారతులు జరిపారు. ఈ కార్యక్రమాలకు ఉభయధారులుగా యర్రా నాగేశ్వరరావు, సత్య దంపతులు వ్యవహరించినట్లు మురళీకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఎస్ఈబీ దాడులు.. నలుగురి అరెస్ట్

చింతలపూడి : స్థానిక ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో శుక్రవారం దాడులు నిర్వహించినట్లు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ సుంకర సాయి స్వరూప్ తెలిపారు. చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం గ్రామంలో, లింగపాలెం మండలం వెస్ట్ యడవల్లి గ్రామంలో, టి.నరసాపురం మండలం కృష్ణాపురం గ్రామంలో దాడులు నిర్వహించి నలుగురిని అరెస్టు చేసినట్లు చెప్పారు. నాగిరెడ్డిగూడెంలో ఇస్లావతు శోభన్‌బాబు, భూక్యా రమేష్‌లను అరెస్టు చేసి 10లీ టర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే 300 లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేశామన్నారు. వెస్ట్‌యడవల్లిలో ఈడ రాజేష్‌ను అరెస్టు చేసి అతని వద్ద నుంచి 40 కేజీల బెల్లాన్ని, మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే బెల్లాని అమ్మిన వ్యక్తి ఎస్.వెంకటరామ తాతారావుపై కేసు నమోదు చేశామన్నారు. కృష్ణాపురంలో జరబల దుర్గాప్రసాద్‌ను అరెస్టు చేసి అతని వద్ద నుంచి 5 లీటర్ల నాటుసారా, మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఈబీ సిబ్బంది దుర్గాప్రసాద్, బాలాజీ పాల్గొన్నారు.

బెదిరించిన నేరంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : బెదిరించి, దాడి చేసిన నేరంపై ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. స్వర్ణవారిగూడెంకు చెందిన పి.రత్తమ్మకు పట్టిన్నపాలెం గ్రామంలో 4.27 ఎకరాల భూమి ఉందని, ఆ భూమిలో పామాయిల్ సాగుచేస్తోందన్నారు. శుక్రవారం పి.వి.లక్ష్మీనర్సమ్మ, మరో నలుగురు దౌర్జన్యంగా పామాయిల్ తోటలోకి ప్రవేశించి పామాయిల్ పంటను తీసుకువెళుతుండగా, రత్తమ్మ, ఆమె కుమార్తె అడ్డుకున్నారన్నారు. దీంతో రత్తమ్మ, ఆమె కుమార్తెను కొట్టి గాయపర్చి, చంపుతానని వారు బెదిరించారని తెలిపారు. ఆ మేరకు రత్తమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

